## నామాట: తెలుగు అంతర్జాతీయ భాషగా.... ! (నిజంగానా?)

జూలై 2007 » సంపాదకీయం

రచన : వేలూరి వేంకటేశ్వర రావు

మొన్న మొన్నటి దాకా, మన పక్కింటి వాడి ధర్మవా అని, తెలుగుని ప్రాచీన భాషగా గుర్తించాలని నానా రకాలవాళ్ళూ, నానా రకాల వాదాలు, వివాదాలు, నినాదాలూ అల్లేశారు, వల్లించేశారు. అదికొంత సద్దుమణిగిందనుకుంటే, దానికి తోడుగా ఇప్పుడొక సరికొత్త నినాదం తెలుగునాట తయారయ్యింది.

- తెలుగు భాష అంతర్జాతీయ భాషగా గుర్తించాలి – అని. మన పక్కింటి వాడిమీద అనుమానం పుట్టిందో ఏమో తెలియదు. కారణం ఏదయితేనేం, ఈ నినాదం ఇప్పుడు వామపక్ష రాజకీయులకి, అరాజకీయుల (?) కీ కూడా ముఖ్య ఆయుధం అయ్యింది. ఇంతకుముందు ప్రాచీన భాషకోసం చేసిన సందడిలో వామపక్షీయులు మరీ యెడంగా ఉండబట్టి, చదువుకున్న వాళ్ళు ( అంటే intellectuals అని నా భావం!) వాళ్ళని మరిచిపోయారనే బాధ కాబోలు!

అసలు, అంతర్జాతీయ భాష అంటే అర్థం ఏమిటి? దాని స్వరూపనిరూపణకి గుర్తు(లు) ఏమిటి? ఇది చాలా జటిలమైన ప్రశ్న.

ఐక్య రాజ్య సమితి వాళ్ళు అధికారయుతంగా గుర్తించిన భాష అంతర్జాతీయ భాష అనా? అదే అయితే, మన జాతీయభాష హిందీ కే దిక్కులేదు! అయినా, ఐక్య రాజ్య సమితిలో ఎవడి ఇష్టమైన భాషలో వాడు మాట్లాడచ్చు. ఎంతసేపు కావాలంటే అంతసేపు రొద పెట్టచ్చు. మిగిలేది కేవలం రణగొణ ధ్వనే తప్ప, అక్కడ ఎవడన్నా ఏదన్నా వింటేనా? ఒప్పుకుంటేనా?

అదికాకపోతే, ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా, ఫలానా ఈ భాషలో మాట్లాడితే అందరికీ కాకపోయినా చాలామందికి అర్థం అవుతుందనా? అదే అయితే, ఇంగ్లీషుకే దిక్కులేదు! యూరపులోను, రష్యాలోను, చైనా లోనూ, (ఉత్తర భారతంలోనూ కూడా!) ఇంగ్లీషు హుళక్కే! అందాకా ఎందుకు; - అమెరికా దేశంలోనే, కొన్ని రాష్ట్రాల్లో ఇంగ్లీషు చలామణి కావడం లేదు, స్పానిష్ చలామణీ అయినంత, సులువుగా, జోరుగా!

అంతర్జాతీయ భాషగా గుర్తించాలన్న నినాదం, ఏ విధమైన ప్రమాదంలేని నినాదంగా మనం గుర్తించాలి. ఈ నినాదం, జనానికి ఎందుకూ పనికిరాని నినాదం! అయితే, ఒక్క విషయం ఒప్పుకో తీరాలి. కొద్దిమంది రాజకీయప్రముఖులకి మాత్రం, ఈ నినాదం, ఆర్భాటంగా దిన పత్రికల్లో గ్రూపు ఫొటో వేయించుకోడానికి పనికి వస్తుంది.

అసలు విషయానికి వద్దాం. ఈ నినాదం నిజంగా తెలుగు భాషమీద మమకారంతో పుట్టిందని అనడం కేవలం భ్రమే! పైగా, ఇందులో చెయ్యి కలిపిన రాజకీయనాయకులకి కేవలం నిస్స్వార్థ భాషాసేవా వాంఛ, ఈ నినాదానికి హేతువు అని ఎవరన్నా పొరపాటునైనా అనుకుంటే, వాళ్ళు తప్పకుండా తక్షణం మానసిక శాస్త్రవైద్యుణ్ణి చూడటం అవసరం.

పాఠశాలల్లో తెలుగు బోధన, తెలుగుభాష మాధ్యమంగా బోధనా ఎంతదిగజారిపోయాయో వేరే చెప్పనక్కర లేదు. అసలు, తెలుగు medium బళ్ళకి వెళ్ళే వాళ్ళు ఎవరు? ముఖ్యంగా నిరుపేదలు. పోతే, చిన్న చిన్న పల్లెటూళ్ళల్లో ఇంగ్లీషులో బోధించే ప్రైవేటు పాఠశాలలు అరుదవడం మరోకారణం. కాస్తో కూస్తో డబ్బులున్న వాళ్ళు, వాళ్ళ పిల్లలని పట్టణంలో ఇంగ్లీషు బడికే పంపిస్తున్నారు. ఇదేమీ తప్పు అనటల్లేదు. ఇంగ్లీషు బడిలో చదువుకుంటే, అమెరికా వెళ్ళక పోయినా భారతంలోనే, ఎక్కడో అక్కడ, ఏదో ఒక call center లో తేలిగ్గా ఉద్యోగం వస్తుందికదా! 2030 వ సంవత్సరం వరకూ ఈ

ఉద్యోగాలకి ఢోకా లేదని కొందరి ప్రముఖుల అంచనా. ఇది వదంతే కావచ్చు! కానీ, తెలుగు బడిలోనే చదువుకుంటే, చప్రాసీ ఉద్యోగంకూడా రాదుకదా! ఇది ప్రస్తుత కాలంలో పచ్చి ఆర్థిక సత్యం అని వేరే చెప్పనక్కరలేదు.

అందుకనే కాబోలు, ఈ మధ్య లాభాపేక్షలేని కొన్ని స్వచ్ఛంద (?) సంస్థలు, ప్రభుత్వంతో లాయికీ అయి, ఇంగ్లీష్ medium బడులు, దిగువ మధ్య తరగతి వారికి, పేదలకోసం (నిరుపేదలు కాదని గమనించాలి!) ప్రారంభిస్తున్నారు. ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. ఈ బడులలో, తెలుగు భాష optional గా తీసుకోవచ్చుట! ఈ బడుల ఉద్యమానికి, ప్రభుతలో ఉన్న రాజకీయ నాయకులు, విద్యాశాఖలో పెద్ద పెద్ద ఆఫీసర్లూ సుముఖులేనట! అయితే, పైకి అలాగని చెప్పరు; ఒప్పుకోరు! చూసీ చూడనట్టుంటారట. కూర్మపృష్టాన్ని కర్రతో బాదుతున్న మూర్ఖుడు, చెడగఱపు బోడ కథ తెలియదూ? ఇంతకన్నా వివరంగా చెప్పక్కరలేదనుకుంటా.

మనకి, రాజకీయ స్వాతంత్ర్యం రాకముందునుంచి ఒక elite class వుండేది. స్వరాజ్యం వచ్చిన తరువాత మన ప్రభుత్వం వారి సంకర విద్యావిధానం మూలంగా మరొక (NewClass ) తయారయ్యింది. ; — ఈ కొత్త ఇంగ్లీషు బడులతో సరికొత్త Newer Class తయారవబోతున్నది. అలాగని నేను ఒక సంస్థ అధికారితో ఒక చిన్న సభలో అంటే, ఆయన: So what? You have anything better? అన్నారు. Amen! అన్నారు సభికులందరూ, కరతాళధ్వనుల మధ్య!!

మళ్ళీ మొదటికొద్దాం. అయితే, తెలుగు అధికార భాషగా, బోధనా భాషగా, –ప్రాచీన భాషగా, అంతర్జాతీయ భాషగా, Universal భాషగా (హా! హా!) — గందరగోళం చేస్తున్న రాజకీయనాయకుల గురించి ఏమంటారు? Fabulous Façade అని అందామా?

### (2 అభిప్రాయాలు) మీ అభిప్రాయం తెలియచేయండి»

1. **Ambanath అభిప్రాయం:**

   July 3, 2007 5:47 am

   నవ్వులు నవ్వే ముందు మీరు ఈ విషయాలు అర్థం చేసుకోండి.

   1. హిందీ మన జాతీయ భాష కాదు. మనం తెలుగుజాతి. మన జాతీయభాష తెలుగు మాత్రమే. ఒకడి మాతృభాష ఇంకొకడికి జాతీయ భాష కాజాలదు. హిందీ మన నెత్తిన రుద్దబడిన పరాయి భాష.

   2. భాషలకి లేబుల్స్ (ప్రాంతీయభాష, జాతీయభాష, అంతర్జాతీయభాష, అధికారభాష, మైనారిటీ భాష వగైరా) వెయ్యడం వాటి యాదృచ్ఛిక ఎదుగుదలని అడ్డుకోవడం కాదా? మానవజాతిని అగ్రకులాలు నిమ్నకులాలు అని విభజించి కొందరిని తొక్కించడం, కొందరిని ఎక్కించడం- దీనికి ఈ లేబుల్స్ కీ తేడా ఏమిటి?

   3. ప్రాథమికంగా ఇంగ్లీషుతో సహా (ఏదో ఒక అర్థంలో) ప్రతి భాషా ప్రాంతీయ భాషే అయినప్పుడు-తెలుగు అంతర్జాతీయ భాష అయితే/అంటే తప్పేమిటి?

   4. అంతర్జాతీయ భాష హోదా లాంటివి ఎవడి పడగ్గదిలో వాడు పడుకుంటే వచ్చేవి కావు. దానికి ప్రయత్నం కావాలి. కృషి కావాలి. ఏ ప్రయత్నమూ లేకుండా సింగపూర్‌లో తమిళానికి అధికార హోదా సిద్ధించలేదు. కాస్త ఆలస్యంగానైనా తెలుగువాళ్ళు ఆ ప్రయత్నం చేస్తే మీకేంటి

బాధ?

5. తెలుగుకు ప్రస్తుతం ఆంధ్రదేశంలో పట్టిన దుర్గతి అది అంతర్జాతీయ భాష కావడానికి అవరోధం కాదు. బ్రాంచీలు లేని వ్యాపారాలు ఈ రోజుల్లో శోభించవు. అలాగే బ్రాంచీలు లేని భాషలు కూడా వృద్ధి చెందవు. అందుకని మన ఆంధ్రదేశం కాక మరో రెండు మూడు దేశాల్లో మన భాషకి అధికార హోదా సంపాదించి పెట్టడానికి మనం కృషిచెయ్యాలి. ఇదో చారిత్రిక అవసరం.

ఈ డిమాండు రాకముందే నా మనసులో ఈ అభిప్రాయం గత కొన్ని దశాబ్దాలుగా ఉంది.

2. **Vamsi Krishna అభిప్రాయం:**

July 8, 2007 7:59 am

యే భాష అయినా అంతజర్జాతీయమో, విశ్వాంతరాళ భాషో అవ్వాలంటే ఎవరో ఒక జీ.ఓ. తేవడమో ఇంకేదో కాదు జరగాల్సింది. భాష వాడుక పెరిగితే పేర్లు లేకున్నా వచ్చే నష్టం లేదు. చలామణిలో లేనప్పుడు ఎన్ని పేర్లున్నా శుద్ధ దండుగే. అన్ని భాషలలో మంచిని కలిపి అదేదో భాష (పేరు గూడా గుర్తుకు రావట్లేదు వెంటనే) అంతర్జాతీయ భాష తయారు చేశారు. ఏమిటీ ఉపయోగం?

యే భాష అయినా ఎంత ప్రాచీనమైనదో ఏదో ప్రభుత్వం చేత డప్పా కొట్టించుకున్న మాత్రాన ఉపయోగం లేదు. **ఇంకా ఎన్ని శతాబ్దాలవరకు నిలిచి ఉండేలా మన భాషను ఎలా పటిష్ఠ పరచగలమో ఆ పని చేయాలి**. అది తక్షణ కర్తవ్యం. అంతర్జాతీయంగా వాడగలిగేలా మన భాషా సంపదను, పదజాలాన్ని పెంపొందిస్తే ఆ ప్రక్రియ మన భాషలో సులువు చేయగలిగితే, దానికి మనమందరమూ ప్రచారం చేస్తే అప్పుడు అంతర్జాతీయమేం ఖర్మ - ఏలియన్సు కూడా మన భాష నేర్చుకోవడానికి ప్రవేశ పరీక్షలు వ్రాసి మరీ వస్తారు ఆంధ్ర దేశానికి.

భాషాభిమానులుగా మన పని మనం చేయకుండా కొంతమంది; మన ఇంట్లోనే మన భాష మాట్లాడ్డం నామర్దా అయిన చాలామంది ఉండటమే మన భాష దుర్గతికి అసలు కారణాం. అసలు పని చేయకుండా గుర్తింపు కోసం వెంపర్లాడితే “ఉట్టికెక్కలేనమ్మ స్వర్గనికెగిరింద’న్న సామెత గుర్తుకువస్తుంది. మన పని చేస్తూ పోతుంటే (ఎక్కువ చలామణిలోకి వచ్చేలా ప్రయత్నం చేస్తే) గుర్తింపులు వాటంతట అవే వస్తాయి.